చక్కని స్టేడియం.. నిరుపయోగం

కోట్ల రూపాయలు వ్యయంతో నిర్మించిన స్టేడియం చిన్న లోపం కారణంగా నిరుపయోగంగా ఉంది. జాతీయస్థాయి ప్రమాణాలున్న స్టేడియంలో వుడెన్ ఫ్లోర్‌కు బదులుగా సిమెంట్ ఫ్లోర్ నిర్మించడంతో పోటీలకు అవకాశం లేకుండా పోయింది. ఆరు కోర్టుల్లో కేవలం బ్యాడ్మింటన్‌కు మాత్రం కొందరు శిక్షణకు వస్తున్నా, వారికీ అవస్థలు తప్పడం లేదు. ఈ చిన్న లోటును సరిదిద్దితే ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

- రూ. 3కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- సిమెంట్ ఫ్లోర్‌తో సరిపెట్టేసిన వైనం
- ఏళ్లు గడిచినా ప్రకటనలకే పరిమితం
- క్రీడాకారులకు సంకటం


ఇండోర్ స్టేడియం


స్టేడియంలో సిమెంట్ ఫ్లోర్

భీమునిపట్నం: భీమిలి ఇండోర్ స్టేడియంలో ఉడెన్ ఫ్లోర్‌కు బదులు సిమెంట్ ఫ్లోర్‌ను నిర్మించడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. భీమిలి సమీపంలో పది సంవత్సరాల క్రితం రూ.3 కోట్లతో వుడా ఆధ్వర్యంలో స్టేడియం నిర్మించారు. ఇందులో ఆరు కోర్టులను ఏర్పాటు చేయగా, వీటిలో వాలీ బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, బ్యాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే అవకాశం కల్పించారు. గ్యాలరీలో 904 మంది కూర్చుని పోటీలను తిలకించే ఏర్పాట్లు చేశారు. అయితే స్టేడియంలో కచ్చితంగా ఉడెన్‌ఫ్లోర్‌ను నిర్మించవలసి ఉంది. దీనివల్ల క్రీడాకారులు జారి కిందకు పడిపోకుండా ఉండడమే కాకుండా, కదలికలకు కూడా అనుకూలంగా ఉంటుంది. అలాగే వేగంగా ఆడే సమయాల్లో మోకాళ్లపై ఎక్కువ ఒత్తిడి పడదు. కానీ, అందుకు భిన్నంగా సిమెంట్‌ఫ్లోర్‌ను నిర్మించడంతో క్రీడాకారులు వేగంగా కదల్లేకపోతున్నారు, తరచూ జారి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. మోకాళ్లకు తీవ్రమైన ఒత్తిడి కలగడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన ఈ స్టేడియంలో ఎంతో ముఖ్యమైన ఫ్లోర్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

జాతీయస్థాయి ప్రమాణాలున్నా..

ఇక్కడి ఫ్లోర్ సమస్య వల్ల ఎటువంటి పోటీలు జరగడంలేదు. సంవత్సరాలు గడుస్తున్నా.. ఉడెన్ ఫ్లోర్ ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటిస్తున్నా.. ఇంకా ఆ ప్రకటనలేవీ కార్యరూపం దాల్చలేదు. దీంతో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి అవకాశం ఉండే ప్రమాణాలతో నిర్మించిన ఈ స్టేడియం నిరుపయోగంగా మారింది.


స్టేడియంలో శిక్షణ పొందుతున్న యువకులు

శిక్షణకూ కష్టమే..

కొంతకాలంగా ఒక కోచ్ పిల్లలకు, యువకులకు షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం చుట్టుపక్కల పలు ప్రాంతాల నుంచి సుమారు 50 మందికి పైనే ప్రతిరోజు వస్తున్నారు. కానీ ఈ ఫ్లోరింగ్‌పై ఆడడానికి వీరందరూ చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉడెన్ ఫ్లోర్‌ను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

చాలా సమస్యగా ఉంది



స్టేడియంలో సిమెంట్ ఫ్లోర్‌పై ఆడడం చాలా సమస్యగా ఉంది. సరైన రీతిలో కదలలేకపోతున్నాం. తరచు జారిపోతున్నాం. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళతో ఆడవలసి వస్తోంది.
– లౌక్య, బొడ్డపాలెం

మోకాళ్లు నొప్పి పెడుతున్నాయి



సిమెంట్ గచ్చుపై ఆడడం వల్ల మోకాళ్లు బాగా నొప్పిపెడుతున్నాయి. వుడెన్ ఫ్లోర్‌పై కదిలినంత చురుగ్గా ఇక్కడ కదల్లేకపోతున్నాం. శ్రమ ఎక్కువగా ఉంటుంది. దీంతో అనుకున్నంతగా ఆడలేకపోతున్నాం.
– నితిన్, తగరపువలస

వెంటనే చర్యలు తీసుకోవాలి



ఇక్కడ ఉడెన్ ఫ్లోర్ లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తోంది. ఈ కారణంవల్ల ఎక్కువ మంది క్రీడాకారులు రావడం లేదు. ఎటువంటి పోటీలు జరగడం లేదు. దీంతో చక్కని ఈ స్టేడియం నిరుపయోగంగా తయారైంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలను వెంటనే తీసుకోవాలి.
– కాళ్ల సన్నీ, విద్యార్థి తండ్రి, భీమిలి

అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం



ఈ స్టేడియంలో సిమెంట్ ఫ్లోర్ వల్ల ఏర్పడ్డ ఇబ్బందుల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తాం. ఆసక్తి ఉండే ప్రతి ఒక్కరూ ఇక్కడ క్రీడలు ఆడడానికి, శిక్షణ పొందడానికి అనుగుణంగా రూపొందిస్తాం.
– ప్రేమ ప్రసన్న వాణి, జోనల్ కమిషనర్

క్లుప్తంగా

ఆర్డీవో సంగీత్ మాథుర్ బాధ్యతల స్వీకరణ


ఆర్డీవో సంగీత్ మాథుర్

భీమునిపట్నం: భీమిలికి కొత్తగా వచ్చిన ఆర్డీవో కె.సంగీత్ మాథుర్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆయనకు మొదటి పోస్టింగ్ ఇక్కడే ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉంటానన్నారు. ఎవరైనా వచ్చి తమ సమస్యలను తెలపవచ్చని, వినతులను ఇవ్వవచ్చని పేర్కొన్నారు. అక్రమ క్వారీల తవ్వకాలు, ఆక్రమణలు జరగకుండా చూడడంతో పాటు అటువంటివి జరిగితే తగిన చర్యలను తీసుకుంటానని తెలిపారు.

జీతాల కోసం కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

భీమునిపట్నం: తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆస్పత్రి వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉంటోందని పేర్కొన్నారు. ఈ నెలలో దసరా, దీపావళి పండగలు ఉన్నా తమ వేతన బకాయిల గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి తమకు అందవలసిన బకాయిలను చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇందులో కార్మికులు ఎస్.భవాని, రామలక్ష్మి, శ్రీనివాసరావు, నూకరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ఎండాడ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఎండాడ, రాజీవ్ నగర్, వరాహగిరి నగర్, ముబారక్ కాలనీ, సాగరనగర్, సుభాష్ నగర్, దసపల్లా లేఅవుట్, ఐటీ పార్కు, రామానాయుడు స్టూడియో, తిమ్మాపురం, రుషికొండ ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మందుబాబులకు రూ.1.6 లక్షల జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. జాతీయ రహదారిపై కొమ్మాది, కారుషెడ్ కూడలి, మారికవలస ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతున్న 16 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం న్యాయస్థానం ముందు హాజరు పరచగా, ఒక్కొక్కరికీ రూ. 10వేలు వంతున లక్షా 60 వేల రూపాయలు జరిమానాగా విధించినట్లు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, హెల్మెట్ లేకుండా ప్రయాణించినా జరిమానా తప్పదని హెచ్చరించారు.

చెరువులో కళేబరాలతో నీరు కలుషితం


ఈవోఆర్డీకి వినతి పత్రం ఇస్తున్న ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో ఆర్అండ్‌బీ రోడ్డును అనుకుని ఉన్న యానాద్రి చెరువులో జంతు కళేబరాలు, కోళ్ల మాంసపు వ్యర్థ పదార్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు సోమవారం ఈవోఆర్డీ మీనా కుమారికి వినతి పత్రం ఇచ్చారు. చెరువులో ఈ వ్యర్థాలను వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని, ఈ నీరు తాగిన పశువులు అనారోగ్యం బారిన పడుతున్నాయని పేర్కొన్నారు. జంతు కళేబరాలను తినడానికి వచ్చిన వీధి కుక్కలు రోడ్డుపై వెళ్లిన ప్రయాణికులను వెంబడించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే


ఆనందపురం ఎంపీడీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ఆనందపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలో ప్రతీ వారం ఒక్కోచోట ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొంటానని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే భీమిలి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఈ సందర్భంగా 56 మంది వినతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, ఎంపీడీవో జానకి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పీఎం పాలెం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ గేదెల బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతానికి చెందిన కేసలి అప్పలనాయుడు (38) ఇద్దరు కుమారులు, భార్యతో స్వస్థలంలో నివసిస్తున్నారు. అప్పలనాయుడు మూడు రోజుల క్రితం కూలి పనుల కోసం నగరానికి వచ్చాడు. అప్పటికే అనారోగ్యంతో బాధ పడుతున్నా మద్యం తాగడం మాత్రం మానలేదు. పీఎం పాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని దుర్గాలమ్మ ఆలయ సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్న వ్యక్తి గురించి పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమేరా ఫుటేజీల్లో ఘటనకు సంబంధించి వివరాలు నమోదయ్యాయని సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

లాభాల బాటలో మధురవాడ పీఏసీఎస్


సంస్థ కార్యకలాపాలు వివరిస్తున్న సీఈవో అప్పలరాజు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.38.60లక్షలు లాభాలు ఆర్జించిందని పర్సన్ ఇన్‌చార్జి ఎం.రమేష్‌బాబు తెలిపారు. సంస్థ ఆవరణలో సోమవారం నిర్వహించిన 65వ మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంఘంలో లాకర్లు కొనుగోలు చేయడానికి కృషి జరుగుతోందని చెప్పారు. సంఘాన్ని క్రెడిట్ సొసైటీగా మార్పు చేసే అంశం ఏపీ రాష్ట్ర సహకార శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పారు. తాజా సభ కూడా వీలైనంత తొందరలో దీనిని క్రెడిట్ సొసైటీగా మార్చాలని కోరింది. సంఘం సీఈవో అప్పలరాజుకు కార్యకలాపాలు వివరించారు. మాజీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల పైడిరాజు, సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పోతిన శ్రీనివాసరావు, కుడితి రామారావు, నాగోతి సూర్యప్రకాశరావు, నమ్మి నర్సింహులు,సభ్యులు పాల్గొన్నారు.

కోరం లేకుండానే సభ

నామమాత్రంగా వచ్చిన సభ్యులతోనే మహాజన సభ ప్రారంభించడం పలు విమర్శలకు తావిస్తోంది. కోరం కూడా లేకుండానే సభ ప్రారంభిస్తారా అని కొందరు ప్రశ్నించినా, సభ నడిపించడం విశేషం.

చిట్టివలస శివారులో గంజాయి బ్యాచ్ హల్‌చల్


శ్మశానవాటిక బయట రాళ్లను పరిశీలిస్తున్న భీమిలి సీఐ సుధాకర్

తగరపువలస: చిట్టివలస శివారు శ్మశానవాటిక కేంద్రంగా ఆదివారం రాత్రి ఐదుగురు ఆకతాయిలు గల గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. వారు గోస్తనినది వంతెన అప్రోచ్ రోడ్డులో చీకటిపడిన తరువాత రాకపోకలు సాగించే దివీస్ ఉద్యోగులను టార్గెట్ చేశారు. స్థానికులు ప్రతిఘటించడంతో అక్కడికి దగ్గరలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ప్రహరీ దాటి లోపలికి ప్రవేశించారు. అనంతరం దాని వెనుక నివాసం ఉంటున్న స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. వారంతా ఏకమై ఇద్దరిని పట్టుకుని రాత్రి 11 గంటల సమయంలో భీమిలి పోలీసులకు అప్పగించారు. దీనిపై భీమిలి సీఐ బి.సుధాకర్ ఈ ప్రాంతంలో సోమవారం విచారణ చేపట్టారు. గొడవ జరిగిన విషయంపై ఫిర్యాదు రావడంతో నిర్ధారించి చర్యలు చేపడతామన్నారు. తరచూ ఈ ప్రాంతంలో రాత్రి 9 గంటల తరువాత ఆకతాయిలు తిష్ట వేసి ఒంటరిగా వెళ్లేవారిపై దాడులకు పాల్పడుతున్నారని, రాత్రి 2గంటల వరకు వీరి బెడద కారణంగా కంటిమీద కునుకు లేకుండా ఉంటున్నామని స్థానికులు వాపోయారు. ఈ ప్రాంతంలో వీధిలైట్లు పునరుద్ధరించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు నిత్యం పోలీస్ నిఘా ఉంచాలని కోరారు.

జోన్-2 పీజీఆర్‌ఎస్‌కు 7 వినతులు


జెడ్సీ సింహాచలంకు వినతులు అందిస్తున్న పీఎం పాలెం వాసులు


భీమిలి కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ ప్రేమ ప్రసన్న వాణి

మధురవాడ: మధురవాడ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు ఏడు వినతులు వచ్చాయి. జెడ్సీ సింహాచలం దరఖాస్తులు స్వీకరించారు. పీఎంపాలెం ఎస్‌కే సీజీపీ కాలనీలో రోడ్లు, కాల్వల మరమ్మతుల గురించి వెదిలి బలరామకృష్ణ తదితరులు, పీఎంపాలెం ప్రశాంతి టవర్స్ అపార్ట్‌మెంట్‌కు ఇంటి పన్ను వేయాలని సీనియర్ సిటిజన్ సర్వదేవుళ్ల వినతులు అందించారు. ఆరో వార్డులో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని టీడీపీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు కోరారు. మధురవాడ సర్వే నెంబరు.151/10ఏలో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని విజయ భాస్కరరావు ఫిర్యాదు ఇచ్చారు. ఇలా జోన్ పరిధిలో వచ్చిన వివిధ దరఖాస్తులపై చర్యలు చేపడతామని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-1కు నాలుగు..

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)కు నాలుగు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు వినతులు, పట్టణ ప్రణాళిక, యూసీడీ విభాగాలకు సంబంధించి ఒక్కొక్క వినతి వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు.

శక్తి స్వరూపిణి.. అష్టసిద్ధి ప్రదాయిని

- మహాచండిగా అమ్మవారి దర్శనం
- మండపాల్లో విశేష హోమాలు, కుంకుమార్చనలు


విజయదుర్గ ఆలయంలో గాయత్రి హోమం చేస్తున్న భక్తులు, నిర్వాహకులు


లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు


పసుపు, కుంకుమ ప్యాకెట్ల అలంకరణలో పైడితల్లమ్మ


సంతపేట గొల్లవీధిలో గరుడపక్షిపై అమ్మవారు


చిట్టివలస రైతుబజారును ఆనుకుని మండపంలో ..


తగరపువలస గ్రంథాలయవీధిలోని మండపంలో అమ్మవారు


చిట్టివలస రెడ్డివీధిలోని మండపంలో కాళీమాతగా..


అన్నపూర్ణాదేవి అలంకరణలో బబ్బేలమ్మ


పూజల్లో పాల్గొన్న విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు


ఎండాడలో మహాచండీ దేవిగా దుర్గమ్మ


మహా చండీ అవతారంలో పద్మావతి అమ్మవారు

తగరపువలస: శరన్నవరాత్రులలో భాగంగా ఐదో రోజైన సోమవారం అమ్మవారు శ్రీమహా చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భీమిలి మండలం తాటితూరులో గ్రామదేవత పైడితల్లమ్మను ఎల్లయ్యరెడ్డి, రాజ్‌కుమార్, సురేష్, రాకేషరెడ్డి పసుపు, కుంకుమ ప్యాకెట్లతో అలంకరించారు. తాళ్లవలస ఎస్సీ కాలనీలోని, టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో అమ్మవారి మండపాల వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండపాలలో అమ్మవారికి కుంకుమపూజలు, చండీహోమాలు నిర్వహించారు. ఆలయాలలో అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం మండపాల వద్ద దీపారాధన నిర్వహించారు.

అన్నపూర్ణా దేవిగా బబ్బేలమ్మ

పీఎం పాలెం: కారుషెడ్ దరి ఆలయంలో బబ్బేలమ్మ అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు.

వైభవంగా గాయత్రి హోమం

మధురవాడ: మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయదుర్గా ఆలయంలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో సామూహిక గాయత్రి హోమం నిర్వహించారు.

- చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మ వారు స్వర్ణ రజతాలంకృత దుర్గాదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. అమ్మవారిని మధురవాడ జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం దంపతులు దర్శించుకున్నారు.

కొమ్మాది: ఎండాడలోని దుర్గమ్మ ఆలయంలో మహాచండీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైన ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పద్మావతి అమ్మవారు మహా చండి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర కుంకుమార్చన, లక్ష్మీ గణపతి హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో సోమవారం బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందినట్టు ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలా ఉన్నాయి. అనంతవరం నుంచి కొత్తకొవ్వాడ వెళుతున్న 222-కె ఆర్టీసీ బస్సు అనంతవరం సమీపంలోని పైడితల్లమ్మ ఆలయం వద్ద రోడ్డుపై నడిచి వెళుతున్న పెంట గ్రామానికి చెందిన దేవరాపల్లి కన్నమ్మ (78) ను ఢీకొట్టింది. కన్నమ్మ తల మీద నుంచి బస్సు వెనుక టైరు వెళ్లిపోయింది. తల నుజ్జునుజ్జుకావడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన

పద్మనాభం: అనుమానం ఉన్నవారు తప్పక హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని లింక్ వర్కర్ స్కీమ్ సీఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి సూచించారు. మండలంలోని పొట్నూరులో ప్రజలకు హెచ్‌ఐవీపై సోమవారంఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త మంగ లక్ష్మి, ఆశ వర్కర్లు సంతోషి, నారాయణమ్మ పాల్గొన్నారు.

నవంబర్ 2 నుంచి మహానారాయణ సేవ


మహానారాయణ సేవ కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 2 తేదీ నుంచి మహానారాయణ సేవ ప్రారంభమవుతుందని సేవా సంఘం ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు తెలిపారు. స్వామి ఆలయం వద్ద సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా నవంబర్ 2 నుంచి డిసెంబర్ 16వ తేదీ వరకు 45రోజుల పాటు నారాయణ సేవను నిర్వహిస్తామని, ఇందులో అయ్యప్ప స్వాములు, ఇతర దీక్షధారులు పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, కోశాధికారి పిల్లి శ్రీను, ముఖ్య సలహాదారులు గుగ్గిళ్ల సాయి, వేణు గురుస్వామి, అంబటి శ్రీను, కనకరాజు పాల్గొన్నారు.

తాటి చెట్లు దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న తాటి చెట్లు

కొమ్మాది: బీచ్ రోడ్డు తిమ్మాపురం రామానాయుడు ఫిల్మ్ స్టూడియో ఎదురుగా సోమవారం సాయంత్రం తాటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇక్కడ ఒక్కసారిగా పొగలు కమ్మి మంటలు వ్యాపించడంతో సుమారు ఆరు తాటి చెట్లు ఆహుతయ్యాయి. గతంలోనూ ఇదే విధంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఎవరో ఆకతాయిలు ఈ చెట్లకు నిప్పు పెట్టి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మధురవాడ సంత వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలి

మహారాణిపేట: మధురవాడ సంత విక్రయదారుల ఉపాధికి రక్షణ కల్పించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం లక్ష్మి మాట్లాడుతూ మధురవాడ జోనల్ ఆఫీస్ వద్ద 40 ఏళ్లుగా శనివారం నాడు సంత నిర్వహిస్తూ 250 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా ఉపాధి కొనసాగిస్తున్న వీరిపై జీవీఎంసీ, పోలీస్ అధికారులు సాగిస్తున్న దాడి సరికాదన్నారు. దీన్ని ఆపివేసి వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని మధురవాడ జోనల్ కమిషనర్‌కు ఆదేశించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా నాయకులు అప్పలరాజు, రాజ్‌కుమార్, ఏపీ ప్రగతిశీల వీధి విక్రయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన్నారి, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులు కె.బాలనాగమ్మ పాల్గొన్నారు.